

బొంరాస్‌పేట : దీప్లానాయక్‌తండా పాఠశాలలో రీడింగ్ కార్నర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

# బడి.. పుస్తక గని

- ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలు
- వికారాబాద్ జిల్లాలోని 527 పాఠశాలల్లో ఏర్పాటు
- ఒక్కో గ్రంథాలయానికి 261 పుస్తకాలు పంపిణీ
- ఎంఆర్‌సీలకు చేరిన పుస్తకాలు



గ్రంథాలయాలకు సరఫరా చేయడానికి వచ్చిన కథల పుస్తకాలు

బొంరాస్‌పేట, మార్చి 7 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సమాజంలో అవసరమైన పరిజ్ఞానాన్ని అందించేందుకు విద్యాశాఖ కృషి చేస్తున్నది. కేవలం ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను వినడం, నోట్స్ రాయడమే కాకుండా ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల్లో పఠనా నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నది. ఇప్పటికే చతుర్విధ ప్రక్రియలైన వినడం, చదవడం, మాట్లాడటం, రాయడంలో విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా విద్యార్థుల్లో పఠనా నైపుణ్యం పెంపొందించడానికి విద్యాశాఖ కార్యాచరణను రూపొందించింది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత తరగతుల వరకు పాఠశాలల్లో ప్రత్యేకంగా గ్రంథాలయాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పీరియడ్‌ను కేటాయించాలని ఉపాధ్యాయులను ఆదేశించింది. ఏర్పాటు చేసిన గ్రంథాలయాలకు నేషనల్ బుక్‌ట్రస్ట్, రాష్ట్ర ప్రభుత్వ ముద్రణా సంస్థ నుంచి వివిధ రకాల పుస్తకాలను విద్యాశాఖ తాజాగా పాఠశాలలకు సరఫరా చేసింది.

వికారాబాద్ జిల్లాలోని 461 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు , 66 ఉన్నత పాఠశాలలకు పలు రకాల కథల పుస్తకాలను సరఫరా చేసింది. ఉన్నత పాఠశాలకు 120 చొప్పున, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 261 చొప్పున కథల పుస్తకాలను అందజేసింది. వీటితో పాటు ఏడు పోస్టర్లు, 10 బిగ్ స్టోరీ బుక్స్‌లను కూడా అధికారులు అందజేశారు. పాఠశాలల్లో గ్రంథాలయానికి ప్రత్యేకంగా గది లేకపోతే బుక్ కార్నర్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం కల్పించాలని సూచించారు. ప్రతి పీరియడ్‌లో 15 నిమిషాలు పఠనం కోసం కేటాయించాలని, ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేకంగా పఠనానికి ఒక పీరియడ్ కేటాయించాలని విద్యాశాఖ నిర్ణయించింది.

### గ్రంథాలయాల ప్రయోజనాలు

పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేలా గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. పుస్తకం, పదాల ఎంపిక, విషయావగాహన చేసుకోవడం, విషయ వ్యక్తీకరణను చేయడం గ్రంథాలయాల ఏర్పాటు ప్రధాన ఉద్దేశం. ఎంచుకున్న పుస్తకాన్ని విద్యార్థి బిగ్గరగా చదువుకోవడం, ఇతరులతో కలిసి సహా పఠనం చేయడం, జత పఠనం, స్వతంత్ర పఠనం ప్రక్రియల్లో పుస్తకంలోని విషయాలను అవగాహన చేసుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

### భాషపై పట్టు పెంచుకుంటారు..

-రేణుకాదేవి, డీఈవో వికారాబాద్



విద్యార్థుల్లో పఠనా సక్తి పెంచడానికి గ్రంథాలయాలను ఏర్పాటు చేసి చాలా రకాల కథల పుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేస్తున్నాం. వారానికి ఒక పీరియడ్‌ను రీడింగ్ కోసం కేటాయించాలని ఆదేశించాం. విద్యార్థులకు నచ్చిన పుస్తకాన్ని ఇంటికి తీసుకెళ్లి చదివి మళ్లీ తెచ్చి ఇవ్వాలి. గతంలో పాఠశాలల్లో రీడింగ్ కార్నర్లను కూడా ఏర్పాటు చేశాం. పాఠశాలల్లో రీడింగ్ కార్నర్లు, గ్రంథాలయాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు విజ్ఞానాన్ని అందిస్తున్నాం. దీనివల్ల విద్యార్థులు భాషపై పట్టు పెంచుకుంటారు.

## చెరువులు కబ్జాకు గురి కావొద్దు

రంగారెడ్డి, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలని అధికారులకు కలెక్టర్ శశాంక సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో కందుకూరు డివిజన్ పరిధిలోని చెరువులు, ప్రభుత్వ భూ ములపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కందుకూరు డివిజన్ పరిధిలోని చెరువులు కబ్జాకు గురికాకుండా ఎఫ్‌టీఐలు, బఫర్ జోన్లను గుర్తించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను రూపొందించాలని ఆదేశించారు. ఆక్రమణల నివారణకు అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవో సూరజ్‌కుమార్, తహసీల్దార్లు, ఇరిగేషన్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ శశాంక

# జీపీల్లో స్పెషల్ డ్రైవ్

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

- ఈ నెల 15 వరకు గ్రామాల్లో వివిధ శాఖల అధికారుల పర్యటన
- ప్రత్యేక నిధుల కేటాయింపు లేవీ లేవు!
- శివరాత్రి, శని, ఆది వారాల్లో సెలవులను రద్దు చేసిన ప్రభుత్వం



రంగారెడ్డి, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : వేసవి రాకముందే కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయి. భూగర్భజలాలు అడుగంటి బావులు, బోర్లతోపాటు జలాశయాల్లోనూ నీటి మట్టాలు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో గ్రామా ల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం జిల్లాలోని 559 గ్రామ పంచాయతీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నది. గురువారమే ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల 15 వరకు కొనసాగనున్నది. వివిధ శాఖల అధికారులు అన్ని గ్రామాల్లో పర్యటించి నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టనున్నారు. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అన్నిరకాల చర్యలు తీసుకోనున్నారు.

### రోజువారీగా నివేదిక..

శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి కృష్ణా జలాలను తరలించి నాలుగు ప్లాంట్లలో నీటిని శుద్ధి చేసిన అనంతరం జిల్లాలో తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకంలో నిర్మించిన ట్యాంకులు, పైపులైన్ ద్వారా జిల్లా వ్యా ప్తంగా 1,068 ఆవాసాల పరిధిలోని 2,91,401 నల్లా కనెక్షన్లకు నీటిని అందిస్తున్నారు. అయితే వేసవిలో నీటి సమస్య రాకుండా ఉండేందుకు అధికారుల బృందం తగు చర్యలు తీసుకోనున్నది. గ్రామాల్లో వాటర్ ట్యాంకులు, పైపులైన్లు పరిశీలించి లీకేజీలు ఉంటే గుర్తించి మరమ్మతులు చేపడతారు. కొన్నేండ్లుగా మిషన్ భగీరథ నీళ్లు పుష్కలంగా వస్తుండడంతో గ్రామాల్లో బోర్లతో పని లేకుం డా పోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో పాత బోర్లను సైతం మళ్లీ వినియోగంలోకి తేనున్నారు. అవసరమైతే వ్యవసాయ బోర్లను సైతం అద్దెకు తీసుకోవాలని ప్రభు త్వం సూచించడంతో ఆ మేరకు చర్యలు తీసుకుంటారు. ఇందుకు సంబంధించి రోజువారీగా ప్రభుత్వం నివేదికలను తెప్పించుకుంటున్నది.

### సెలవులు రద్దు..

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఇంజినీర్లు నిత్యం గ్రామాల్లో పర్యటించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలి. గురువారం నుంచి ఈ కార్యక్రమం మొదలవ్వగా..శుక్రవారం శివరాత్రి పండుగ.. ఆ తర్వాత రెండో శనివారం, ఆదివారాలు వస్తున్నాయి. స్పెషల్ డ్రైవ్ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ అధికారుల సెలవులను ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఆయా ఉద్యోగులు ఒకింత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పండుగ రోజు కూడా సెలవు ఇవ్వకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. గత నెలలో చేపట్టిన పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమ సందర్భంగానూ పంచాయతీరాజ్ శాఖ సెలవులను రద్దు చేసింది. స్పెషల్ డ్రైవ్‌లోనూ అదే విధానాన్ని అనుసరిస్తున్నది. మరోపక్క ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌కు ప్రత్యేక నిధుల కేటాయింపులేవీ జరుపలేదు. ఎమ్మెల్యే కోటా నిధులు లేకుంటే..గ్రామ పంచాయతీల నిధులు వెచ్చించాలని సూచించినట్లు తెలిసింది.



మహేశ్వరంలో విద్యుద్దీపాల కాంతుల్లో మెరిసిపోతున్న శివాలయం

# శివరాత్రి శోభ

నేటి శివరాత్రి వేడుకలకు ఉమ్మడి జిల్లాలోని పలు శివాలయాలు ముస్తాబయ్యాయి. నిర్వాహకులు పోటీపడి ఆలయాలను అందంగా తీర్చిదిద్దారు. మామిడాకుల తోరణాలు, రకరకాల పూలతో దేవాలయాలను అలంకరించారు. విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడంతో రాత్రుల్లో ఆలయాలు ధగధగ మెరుస్తున్నాయి. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని కమిటీల సభ్యులు సకల సౌకర్యాలను కల్పించారు. –న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



షాద్‌నగర్‌లోని రామలింగేశ్వరాలయం..

# పది లక్షలు డ్రా చేస్తే..
# సమాచారం ఇవ్వండి..!

- అనుమానాస్పదమైన బ్యాంకు లావాదేవీలపై దృష్టి పెట్టండి
- ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి చెక్‌బుక్ జారీ చేయాలి
- గత మూడు నెలలకు సంబంధించి నగదు లావాదేవీల నివేదికను ఇవ్వాలి
- బ్యాంక్ కో ఆర్డినేటర్లు, నగదు రవాణా ఏజెన్సీ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి

సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : అనుమానాస్పదమైన బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ బ్యాంకర్లను కోరారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్‌హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్, పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్యాంక్ కో ఆర్డినేటర్లు, నగదు రవాణా ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు కో ఆర్డినేటర్లకు, నగదు రవాణా ఏజెన్సీలకు ఎన్నికల నియమావళి, నగదు రవాణా మార్గదర్శకాలను వివరించారు. ఎన్నికల సమయంలో నిబంధనల మేరకు నడుచుకోవాలని, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత ఎన్నికలకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. నగదు రవాణాలో సరైన ఆధారాలు లేని ఏజెన్సీలు, బ్యాంకు కో – ఆర్డినేటర్స్ వాహనాలను సీజ్ చేసే అధికారం ఉన్నందున అధికారిక అనుమతి పత్రాలతో బ్యాంకు నుంచి ఏటీఎంలకు నగదు రవాణా తదితర అంశాలను వివరించారు. 10 లక్షలకు పైబడి నగదు, ట్రాన్స్‌ఫర్ చేసినా వాటి వివరాలను, ఏటీఎం, యూపీఐ లావాదేవీలపై ఆయా బ్యాంకు అధికారులు అందించాలని ఎన్నికల అధికారి కోరారు. ముఖ్యంగా గత మూడు నెలలకు సంబంధించి నగదు లావాదేవీల నివేదికను బ్యాంకు బ్రాంచ్ వారీగా ఇవ్వాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి కొత్తగా కరెంట్ అకౌంట్ ఓపెన్ చేస్తారని, జాప్యం చేయకుండా వెంటనే చెక్ బుక్ జారీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, ఆర్‌బీఐ మేనేజర్ అంకిత్‌అగర్వాల్, ఎల్‌డీఎం సుబ్రహ్మణ్యం, ఎలక్షన్ ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్ శరత్ చంద్ర, వివిధ బ్యాంకుల కో ఆర్డినేటర్లు, నగదు రవాణా ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## 24 రోజులు..

- ఆస్తిపన్ను వసూళ్లపై వేగం పెంచేందుకు రంగం సిద్ధం
- సర్కిల్‌కు ఒకరి చొప్పన సూపర్‌వైజర్ల నియామకం

# టార్గెట్ రూ.685 కోట్లు



సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ): త్వరలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలతో ముందుకెళ్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 2100కోట్ల నిర్దేశిత లక్ష్యంలో అసెంబ్లీ ఎన్నికల ప్రభావం పడి ఇప్పటి వరకు కేవలం రూ. 1428 కోట్ల మేర మాత్రమే వసూళ్లను రాబట్టుకున్నది. రూ. 672 కోట్ల కలెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ రాయితీ అందిస్తూ వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీంను అందుబాటులోకి తీసుకువచ్చింది. బకాయి ఉన్న వారంతా తక్షణమే 10శాతం వడ్డీతో మాత్రమే బకాయిలు క్లియర్ చేసుకునే వెసులుబాటు దొరికింది. దీంతో ఈ నెలాఖరు 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో వచ్చే 24 రోజుల్లో సర్కిల్‌ల వారీగా లక్ష్యాలను ఖరారు చేస్తూ శుక్రవారం కమిషనర్ రొనాల్డ్‌రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా సర్కిల్‌కు ఒక సూపర్‌వైజరీ ఆఫీసర్లుగా నియమించారు. ఇందులో ఐఏఎస్‌ల నుంచి సీనియర్ అధికారుల వరకు ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలపై అదనపు కమిషనర్ (ఫైనాన్స్) జయరాజ్ కెనెడీ పర్యవేక్షించనున్నారు. ఇక ఐఏఎస్‌ల నుంచి ముఖ్య అధికారుల వరకు 31 సర్కిళ్లలో ఒక్కో సర్కిల్‌కు సూపర్‌వైజర్లకు బాధ్యతలను అప్పగించారు. వారు రోజూ వారీగా వసూలైన ఓటీఎస్ కలెక్షన్లను పీటీఐఎన్ నంబరు, వచ్చిన కలెక్షన్ల వివరాలను ఎప్పటికప్పుడు సమాచారం అందించనున్నారు. ఆయా సర్కిల్ పరిధిలో టాప్ డిఫాల్టర్స్ (బకాయిదారుల) లిస్ట్‌ను తీసుకొని వారికి నోటీసులు జారీ చేయడం, చెక్ బౌన్స్‌లపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఓటీఎస్ వసూళ్లలో వేగం పెంచాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

### నిర్దేశిత లక్ష్యాలు జోన్ల వారీగా

| జోన్ | లక్ష్యం (రూ.కోట్లలో) |
|---|---|
| సికింద్రాబాద్ | 98.63 |
| కూకట్‌పల్లి | 101.46 |
| శేరిలింగంపల్లి | 117.64 |
| ఖైరతాబాద్ | 194.35 |
| ఎల్‌బీనగర్ | 123.10 |
| చార్మినార్ | 50.56 |